తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-09-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 311 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# సుస్థిర పట్టణాభివృద్ధికి కట్టుబాటు

## 'గ్రీన్ ప్రాపర్టీ షో-2026' బ్రోచర్ ఆవిష్కరణ

**హైదరాబాద్,ఏప్రిల్08(తెలంగాణ ముచ్చట్లు ):**
తెలంగాణను నెట్ జీరో భవిష్యత్తు వైపు నడిపిస్తూ, సుస్థిర పట్టణాభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ మూడవ ఎడిషన్ 'గ్రీన్ ప్రాపర్టీ షో-2026' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.
కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించబడుతున్న ఈ ప్రదర్శన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ బిల్డింగ్ రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.
హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మే 22 నుంచి 24 వరకు "బెటర్ హోమ్స్ ఫర్ యూ" అనే థీమ్‌తో ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో పర్యావరణానికి అనుకూలమైన గ్రీన్ ప్రాజెక్టులు, ఆధునిక నిర్మాణ పద్ధతులు ప్రదర్శించబడతాయి.
ఈ ప్రదర్శన ద్వారా గాలి నాణ్యత మెరుగుదల, విద్యుత్ ఆదా, తక్కువ ఖర్చుతో జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాలపై అవగాహన కల్పించబడుతుంది. పర్యావరణ హిత ఉత్పత్తులు, సేవలు అందుబాటులో ఉండడంతో పాటు, పౌరులు తమ జీవనశైలిని పర్యావరణానికి అనుగుణంగా మార్చుకునే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుంది.

## సమాజాభివృద్ధి ఖర్చు కాదు, భాగస్వామ్యం

### ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి

**హైదరాబాద్,ఏప్రిల్ 08(తెలంగాణ ముచ్చట్లు ):** సమాజాభివృద్ధి కోసం చేసే కార్యక్రమాలను ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల వినియోగంపై వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో..



## బీఆర్ఎస్ నేతలవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- అవినీతి బురదను ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజం
- నాదర్గుల్ భూములపై తప్పుడు ప్రచారం.. అబద్ధాలను నిజం చేయలేరు
- బీఆర్ఎస్ హయాంలోని మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక హరీశ్ రావు, కేటీఆర్ వంటి నేతలు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. "పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు.. గత పదేళ్లలో వారు చేసిన అవినీతిని అందరూ చేస్తున్నారని భ్రమపడుతున్నారు" అని మంత్రి ఎద్దేవా చేశారు.

మిగతా 2లో..



## తెలంగాణతో ఘనా మైత్రి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హై కమిషనర్ క్వాసీ ఒబిరి భేటీ
- విద్య, వైద్యం మరియు సాంకేతిక రంగాలలో పరస్పర సహకారంపై చర్చలు
- తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఘనా ఆసక్తి
- రెండు దేశాల మధ్య వాణిజ్య బంధాల బలోపేతానికి నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రం మరియు ఘనా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఒక కీలక అడుగు పడింది. ఘనా హై కమిషనర్ క్వాసీ ఒబిరిడాన్సో బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ అత్యంత సౌహార్దపూర్వక వాతావరణంలో జరిగిందని, తెలంగాణ అభివృద్ధి పథాన్ని గమనిస్తున్న ఘనా ప్రభుత్వం మన రాష్ట్రంతో సన్నిహితంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

మిగతా 2లో..



## మల్కాజ్‌గిరిలో ఉద్రిక్తత

- ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై చిరు వ్యాపారుల నిరసన
- టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు పోలీసుల ఆధ్వర్యంలో భారీ చర్యలు
- సామాన్లు సర్దుకునేందుకు సమయం ఇవ్వాలని బాధితుల ఆందోళన
- ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఆక్రమణలు తొలగించక తప్పదని వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్‌గిరి ప్రధాన చౌరస్తాలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ బుధవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో ఈ ప్రాంతంలో నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

మిగతా 2లో..



## రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- సన్నాలకు 500 బోనస్.. 30 వేల టన్నుల గోదాముల నిర్మాణం
- మిల్లులకు ధాన్యం తరలింపులో జాప్యం వహించవద్దని అధికారులకు ఆదేశం



2లో




## ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మిడ్ వైఫరీ శిక్షణకు శ్రీకారం

- సహజ ప్రసవాల ప్రోత్సాహానికి కొత్త చర్యలు
- గర్భిణీల ఆరోగ్యంపై సమగ్ర పథకాలు
- నర్సింగ్ రంగానికి మరిన్ని ఉద్యోగావకాశాలు

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

**నల్గొండ, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** నల్గొండ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, రైతులు పండించిన ధాన్యాన్ని ఏరోజుకారోజు తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టినా లేదా కొనుగోలులో నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా పనిచేయాలని సూచించారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా ఐకెపి (IKP) సంఘాల కోసం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ధాన్యం సేకరణలో తాలు మరియు తరుగు పేరుతో రైతులను మోసం చేయవద్దని, నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర రైతులకు అందేలా చూడటంలో అధికారులదే బాధ్యతని ఆయన గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మిల్లర్లు మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, వారం రోజుల్లో కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని గడువు విధించారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారుల బారిన పడి రైతులు నష్టపోవద్దని ఆయన కోరారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించాలని, చెల్లింపులు కూడా నేరుగా రైతుల ఖాతాల్లోకి సకాలంలో జమ అయ్యేలా పర్యవేక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. యాసంగి సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా మంత్రి ఈ సందర్భంగా ఆరా తీశారు. నీటి సరఫరా మరియు విద్యుత్ సౌకర్యాల విషయంలో ఎక్కడా అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత శాఖలను కోరారు. ప్రభుత్వం రైతు పక్షపాతంగా వ్యవహరిస్తోందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి పర్యటనతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగం పుంజుకుంది. నల్గొండ జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న గోదాముల కొరతను తీర్చేందుకు చేపట్టిన కొత్త నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. దీనివల్ల ధాన్యం నిల్వ చేయడంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు తప్పుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కంటే మెరుగైన సౌకర్యాలతో కొనుగోలు కేంద్రాలను తీర్చిదిద్దామని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి ఈ పర్యటన జిల్లాలోని రైతుల్లో కొత్త ఆశలు నింపింది. ప్రభుత్వం అందించే బోనస్ మరియు సకాలంలో కొనుగోలు ప్రక్రియ తమకు ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మిడ్ వైఫరీ శిక్షణకు శ్రీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో సహజ ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మిడ్ వైఫరీ శిక్షణ కేంద్రాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. బోయగూడలోని మిడ్‌వైఫరీ శిక్షణ సంస్థలో నిర్వహించిన సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సిజేరియన్ ప్రసవాలను తగ్గించి నార్మల్ డెలివరీలను పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మాతృత్వం మహిళలకు ఒక గొప్ప వరమని, ఈ ప్రయాణంలో వారికి సురక్షితమైన, గౌరవప్రదమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. గర్భిణీ ఆరోగ్యం అంటే శిశు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, సమాజ అభివృద్ధికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం లక్షలాది గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రతి గర్భిణీకి ఉచిత యాంటీనేటల్ పరీక్షలు, స్కానింగ్‌లు, అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రక్తహీనత నివారణకు ఐఎఫ్ఏ మాత్రలు, కాల్షియం సరఫరా, అవసరమైన వారికి ఐరన్ ఇంజెక్షన్లు అందిస్తున్నామని చెప్పారు. హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నామని, 102 వాహనాల ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. “అనీమియా ముక్త భారత్”, “ఆరోగ్య మహిళ” వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. నర్సింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఇప్పటికే 370 మంది నర్సులకు మిడ్ వైఫరీ శిక్షణ అందించామని, త్వరలోనే అన్ని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో దాదాపు పది వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసి ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్టం చేశామని చెప్పారు. మరో రెండు రోజుల్లో 2322 నర్సింగ్ పోస్టుల భర్తీ పూర్తవుతుందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాల కోసం నర్సింగ్ విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ కూడా అందిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# సమాజాభివృద్ధి ఖర్చు కాదు, భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

సీఎస్ఆర్ నిధులు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా వినియోగం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, కంపెనీలు కూడా ఈ రంగాలతో పాటు తమకు అనుకూలమైన ఇతర రంగాల్లోనూ సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు కలిసి చేసే వ్యయంతో రాష్ట్ర విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. విద్యపై చేసే ఖర్చును భవిష్యత్ తరాలపై పెట్టుబడిగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థుల్లో గణనీయమైన శాతం హైదరాబాద్‌లోనే ఉండటంతో, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వినియోగిస్తున్న సంస్థలు, తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ భాగాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో సరైన విధానం లేకపోవడంతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించినట్లు తెలిపారు.



ఆ అధికారితో సమన్వయం చేసుకుని విద్య, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ వంటి రంగాల్లో నిధులు వినియోగించవచ్చని సూచించారు. ఇప్పటికే పలు సంస్థలు విద్యాభివృద్ధికి ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. కార్పొరేట్ ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల వినియోగంపై ఈ విధంగా సంప్రదించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ చొరవను స్వాగతిస్తూ, పాఠశాల విద్య, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు సహకరించేందుకు సిద్ధమని వెల్లడించారు .ఈ సమావేశంలో వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణతో ఘనా మైత్రి

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పెరుగుతున్న ప్రాముఖ్యతకు ఈ భేటీ నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ఉన్న సామాజిక మరియు ఆర్థిక సారూప్యతలపై చర్చలు జరిగాయి. తెలంగాణ మరియు ఘనా మధ్య విద్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ మరియు వాణిజ్య రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలనే ఆకాంక్షను హై కమిషనర్ క్వాసీ ఒబిరి ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉన్నత విద్య కోసం తెలంగాణకు వస్తున్న విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, విద్యా రంగంలో ఉమ్మడి పరిశోధనలు మరియు నాలెడ్జ్ షేరింగ్ (జ్ఞాన మార్పిడి) ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. దీనివల్ల రెండు ప్రాంతాలలోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయి. అలాగే వైద్య రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిని ఘనా ప్రతినిధి ప్రత్యేకంగా ప్రశంసించారు. పెట్టుబడుల పరంగా కూడా తెలంగాణ ఒక ఆకర్షణీయమైన గమ్యస్థానమని హై కమిషనర్ అభిప్రాయపడ్డారు. పరస్పర వృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుబడులు మరియు పారిశ్రామిక సహకారం ఉండాలని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయం మరియు ఐటీ రంగాలలో తెలంగాణకున్న నైపుణ్యాన్ని ఘనా దేశం ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఇందుకు ప్రతిస్పందనగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఘనా నుండి వచ్చే పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్స్‌లో భాగంగా ఆఫ్రికా దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకోవడం తెలంగాణకు వ్యూహాత్మకంగా మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాల మధ్య సంబంధాలే కాకుండా, రెండు దేశాల ప్రజల మధ్య (పీపుల్‌టుపీపుల్) అనుబంధం పెరగడం అత్యంత ముఖ్యమని ఈ సమావేశంలో చర్చించారు. సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల ద్వారా ఒకరి సంస్కృతిని మరొకరు అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని, ఇది వాణిజ్య సంబంధాలను మరింత సులభతరం చేస్తుందని భావిస్తున్నారు. పర్యాటక రంగంలో కూడా ఉమ్మడి ప్రణాళికలతో ముందుకు సాగడం వల్ల రెండు ప్రాంతాలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనా హై కమిషనర్‌కు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జ్ఞాపికను బహూకరించి ఆత్మీయ గౌరవాన్ని చాటుకున్నారు. తెలంగాణ రైజింగ్ నినాదంతో ప్రభుత్వం ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న తరుణంలో, ఘనా వంటి దేశాలతో కుదురుతున్న ఈ మైత్రి భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు మార్గం సుగమం చేయనుంది. దౌత్యపరమైన సంబంధాలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వాణిజ్య ఒప్పందాలుగా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భేటీ ద్వారా తెలంగాణకు విదేశీ వాణిజ్యంలో కొత్త ద్వారాలు తెరుచుకోనున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఘనా నుండి ఒక ఉన్నత స్థాయి వ్యాపార ప్రతినిధి బృందం తెలంగాణను సందర్శించే అవకాశం ఉందని తెలుస్తోంది.

# బీఆర్ఎస్ నేతలవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా నాదర్గుల్ భూ వివాదంపై వస్తున్న ఆరోపణలను మంత్రి పొంగులేటి తీవ్రంగా ఖండించారు. నాదర్గుల్ సర్వే నంబర్ 613లోని 373 ఎకరాల ప్రభుత్వ భూమికి బీఆర్ఎస్ హయాంలోనే (202122 మధ్య) అక్రమంగా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు జరిగాయని ఆయన ఆధారాలతో వివరించారు. అప్పుడు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఆ భూమిలో రోడ్లు వేయించింది కూడా వారేనని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు తన కుమారుడు హర్షా రెడ్డి ఆ భూమిని కబ్జా చేస్తున్నట్లు దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చాకే ఆ భూమి ప్రైవేటు పరం కాకుండా సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేసి పోరాడుతున్నామని స్పష్టం చేశారు. వట్టినాగులపల్లి మరియు కొత్వాల్‌గూడ క్రషర్ వివాదాలపైనా మంత్రి వివరణ ఇచ్చారు. వట్టినాగులపల్లి భూమి వివాదం తన కుటుంబానికి సంబంధించిన 6070 ఏళ్ల పాత వ్యవహారమని, దానికి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కోర్టులో ఉన్న అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం శోచనీయమన్నారు. ఇక కొత్వాల్‌గూడ క్రషర్ విషయంలో హరీశ్ రావు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు. 2007 నుంచే అక్కడ క్రషర్ నడుస్తోందని, రాఘవ కన్‌స్ట్రక్షన్ కేవలం అక్కడి నుండి మెటీరియల్ కొనుగోలు చేస్తోందని, దానికి మైనింగ్‌తో సంబంధం లేదని పవర్ బిల్లులు, జీఎస్టీ రికార్డులను మంత్రి బయటపెట్టారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై తమ ప్రభుత్వం సీబీసీఐడీ విచారణ జరుపుతుందని మంత్రి సంచలన ప్రకటన చేశారు. 2014 నుండి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మైనింగ్ అవినీతిపై విచారణ జరుగుతుందని, అప్పుడు ఎవరి పాత్ర ఏమిటో, ఏ 'హోమ్' పాత్ర ఏమిటో అన్ని వివరాలు బయటకు వస్తాయని హెచ్చరించారు. అబద్ధాలను నిజం అని నమ్మించడానికి 'అబద్ధాల రావు', 'డ్రామా రావు'లు పడుతున్న తంటాలను ప్రజలు గమనిస్తున్నారని, వారి అహంకారానికి ఈ ప్రభుత్వం భయపడదని స్పష్టం చేశారు. సొంత పార్టీ నేతలే హరీశ్ రావు అవినీతిపై చేసిన 10 అంశాల ఆరోపణలకు ఇప్పటి వరకు సమాధానం చెప్పలేదని ఆయన గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుంటే, అధికారం కోల్పోయిన అక్కసుతో బీఆర్ఎస్ నేతలు విర్రవీగుతున్నారని పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్ను గెలిపించి బాధ్యతాయుతమైన పదవిని ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు కలలో కూడా అన్యాయం చేయబోనని ఆయన ఉద్వేగంగా పేర్కొన్నారు. హరీశ్ రావు చేస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కాలం చెల్లిందని, నిత్యం అసత్యాలు పలికే ఆయనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజా సేవ తప్ప తమకు ఎటువంటి స్వార్థ చింతన లేదని, అబద్ధాలతో సింపతీ పొందాలని చూస్తే భవిష్యత్తులో వారి రాజకీయ జీవితమే ప్రశ్నార్థకం అవుతుందని మంత్రి హితవు పలికారు.

# మల్కాజ్‌గిరిలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమస్యకు పరిష్కారంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అయితే, జేసీబీలతో అధికారులు రంగంలోకి దిగడంతో చిరు వ్యాపారులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తమ జీవనోపాధిని దెబ్బతీయవద్దని అధికారులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి అక్కడ ఉధృత వాతావరణం నెలకొంది.

అధికారులు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా షాపులను తొలగిస్తున్నారని చిరు వ్యాపారులు ఆరోపించారు. తమ సామాగ్రిని తామే తొలగించుకుంటామని, కనీసం సామాన్లు సర్దుకునేందుకైనా కొంత సమయం ఇవ్వాలని వారు అధికారులను వేడుకున్నారు. అధికారులు మాత్రం ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతోనే ఈ చర్యలు చేపట్టాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. పోలీసుల జోక్యంతో వ్యాపారులు తమ వస్తువులను పక్కకు జరుపుకునే వరకు కొంత సమయం వేచి చూశారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది జేసీబీలతో అక్రమ కట్టడాలను మరియు షెడ్లను పూర్తిగా తొలగించారు. ఈ క్రమంలో పోలీసులకు మరియు వ్యాపారులకు మధ్య జరిగిన వాగ్వివాదం వల్ల ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది.

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఫుట్‌పాత్‌లను క్లియర్ చేయడం అత్యవసరమని అధికారులు పేర్కొన్నారు. పాదచారులకు నడిచేందుకు చోటు లేకపోవడంతో వారు రోడ్డుపైకి వస్తున్నారని, ఇది ప్రమాదాలకు దారి తీస్తోందని వివరించారు. ముఖ్యంగా మల్కాజ్‌గిరి చౌరస్తా వంటి రద్దీ ప్రాంతాల్లో ఆక్రమణల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మళ్లీ ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మరియు జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా చిరు వ్యాపారులను హెచ్చరించారు.
చిరు వ్యాపారుల నిరసనలతో మల్కాజ్‌గిరి రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఆందోళనకారులను శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించగా, కొందరు వ్యాపారులు జేసీబీలకు అడ్డుగా పడుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయంగా వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇదే ప్రాంతంలో వ్యాపారం చేసుకుంటున్నామని, ఒక్కసారిగా షాపులు తొలగిస్తే తమ కుటుంబాలు వీధిన పడతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి విషమించకుండా అదనపు బలగాలను రంగంలోకి దించిన పోలీసులు, ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించివేసి ఆక్రమణల తొలగింపును పూర్తి చేశారు.
ప్రజా సౌకర్యార్థం చేపట్టిన ఈ చర్యలు అవసరమే అయినప్పటికీ, చిరు వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. వారికి నిర్దేశిత ప్రదేశాల్లో వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తే ఇటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ఉంటాయని అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం నగరవ్యాప్తంగా అన్ని ప్రధాన మార్గాల్లో ఇదే తరహాలో ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఆర్ నగర్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో కూడా ఇప్పటికే ఇటువంటి డ్రైవ్‌లు కొనసాగుతున్నాయి. మల్కాజ్‌గిరిలో తాజాగా జరిగిన ఈ పరిణామం చుట్టుపక్కల ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది.



# వేంసూరు 108 అంబులెన్స్‌పై సమగ్ర తనిఖీ.!

**సత్తుపల్లి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**

వేంసూరు 108 అంబులెన్స్‌పై సమగ్ర తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సేవల కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఆడిటర్లు ఫకీరు దాస్, వెంకటేశ్వర్లు ఈ తనిఖీ చేపట్టారు. అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాల పనితీరు, మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, నిర్వహణ రికార్డులను వారు పరిశీలించారు. సిబ్బంది విధి నిర్వహణపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు తేనేటి మురళీకృష్ణ, వాహన చోదకుడు కొండ్రు రవి తమ విధులను వివరించారు. తనిఖీలో ఖమ్మం జిల్లా 108 మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ పాల్గొన్నారు.




# సత్తుపల్లి ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్య అవగాహన

- అప్రమత్తతతో ఉండాలని వైద్యుల సూచన.
- డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్.

**సత్తుపల్లి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి సరైన అవగాహన కలిగి ఉండాలని తార్నాక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ సూచించారు. ప్రజా ప్రభుత్వం ప్రగతి నివేదన కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో బుధవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరమని తెలిపారు. మానసిక ఆరోగ్యం, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ఉద్యోగులకు సూచనలు ఇచ్చారు. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ చేసే విధానాన్ని కూడా వివరించారు. ఉద్యోగ సమయంలో మాస్క్ ధరించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తే కుటుంబంతో పాటు సంస్థకు కూడా ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, హెల్త్ వాలంటీర్ నాగభూషణం, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఏడీసీలు, సూపర్వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో 18న ఉద్యమ గర్జన

## భారీగా తరలిరండి: సంజీవరెడ్డి పిలుపు

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ మిన్నంటించేలా ఈనెల 18న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఉద్యమకారుల సమావేశానికి జిల్లా ఫోరం అధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి ఘన పిలుపునిచ్చారు. జమ్మికుంట మండలం నాగంపేటలో జరిగిన సమావేశంలో ఆయన ఉత్సాహభరితంగా మాట్లాడుతూ, ఈ సభ సాధారణ సమావేశం కాదని, ఉద్యమ చరిత్రను గుర్తుచేసుకుంటూ భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక వేదికగా మారుతుందని తెలిపారు. ఈ మహాసభకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ విజయశాంతి వంటి ప్రముఖులు హాజరవుతుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఉద్యమకారుడు, ప్రతి కార్యకర్త భారీగా తరలి వచ్చి ఈ సభను విజయవంతం చేసి తమ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశం ద్వారా ఉద్యమకారుల సమస్యలు, ఆశయాలు, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని, తెలంగాణ ఉద్యమ ఆత్మను మరోసారి గట్టిగా వినిపించే సందర్భమిదని సంజీవరెడ్డి స్పష్టం చేశారు.




# దిశా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే జారె

- కేంద్ర పథకాలపై సమీక్ష.
- ప్రజలకు చేరేలా చర్యలు అవసరం.

**అశ్వారావుపేట, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన దిశా కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ఎలా జరుగుతోందో సమీక్షించారు. ఈ సమావేశానికి ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అధ్యక్షత వహించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, గ్రామాల్లో ఉన్న ప్రతి అర్హుడికి కేంద్ర పథకాలు అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. రహదారులు, తాగునీరు, ఇళ్లు, విద్య, వైద్యం వంటి ముఖ్యమైన రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలని కోరారు. పోడు భూముల సమస్యలు, విద్యుత్ సమస్యలు, ఆరోగ్య సేవల లోపాలను కూడా ఆయన ప్రస్తావించారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు వేగంగా, పారదర్శకంగా అమలు కావాలని, అధికారులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# బస్తీల్లో వీధిదీపాల సమస్యలపై ఆందోళన

- "బస్తిబాట"లో ప్రజల గోడు వెలుగులోకి
- విద్యుత్ శాఖకు వినతిపత్రం, కొత్త స్తంభాల ఏర్పాటు డిమాండ్

**మల్లాపూర్, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**

"బస్తిబాట" కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలను సందర్శించిన సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు బయటపడ్డాయి. ముఖ్యంగా బస్తీ ప్రాంతాల్లో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకట్లు నెలకొని, అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా చీకటి కారణంగా వీధుల్లో కుక్కల బెడద అధికమై ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద సరైన వెలుతురు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని నివాసితులు పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నెమలి అనిల్ విద్యుత్ శాఖ డీఈ సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిదీపాలను కల్పించాలని కోరారు. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కృషి కొనసాగుతుందని నెమలి అనిల్ తెలిపారు.



# గ్రీన్ పార్క్ ఎంక్లేవ్‌లో సీసీ రోడ్ల పనుల పరిశీలన

- రూ.28.30 లక్షలతో అభివృద్ధి
- ప్రజల సమస్యలకు త్వరలో పరిష్కారం: స్వర్ణరాజ్ శివమణి

**కాప్రా, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కాప్రా డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ ఎంక్లేవ్ కాలనీలో కార్పొరేటర్ నిధులతో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్ల పనులను మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో మంజూరు చేసిన రూ.28.30 లక్షల నిధులతో 40 అడుగుల ప్రధాన రోడ్లు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం కొనసాగుతోందని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన, ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ఇతర రోడ్ల సమస్యలను కూడా త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల సేవలో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గ్రీన్ పార్క్ ఎంక్లేవ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తూ, స్వర్ణరాజ్ శివమణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి. పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, రిజ్వాన్ ఖాన్, సత్తిరెడ్డి, వినయ్ తదితరులు, అలాగే అసోసియేషన్ ప్రతినిధులు సుధాకర్ గౌడ్, మదన్మోహన్, రంగనాథ్, పార్థసారథి, రాధిక, బి.వి. రావు, ప్రదీప్, రవీంద్రనాథ్, కె. రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# యాప్రాల్‌లో రూ.33 లక్షల సీసీ రోడ్ల పనులు ప్రారంభం

- ఎంపీ ఈటల రాజేందర్,
- మాజీ కార్పొరేటర్ కోతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి కృషికి ఫలితం

**నేరెడ్‌మెట్, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజ్గిరి నియోజకవర్గం నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ రామ హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎంపీ ఈటల రాజేందర్ మరియు మాజీ కార్పొరేటర్ కోతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి చేసిన వినతుల మేరకు జోనల్ కమిషనర్, కమిషనర్ అధికారులు రూ.33 లక్షల విలువైన సీసీ రోడ్లకు ఆమోదం తెలిపారు. బుధవారం ఈ రోడ్ల నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి సమస్య కారణంగా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఇప్పుడు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనిని సాధించడంలో నిరంతర ఫాలోఅప్ చేసి పూర్తి చేయించినందుకు ఎంపీ ఈటల రాజేందర్, మాజీ కార్పొరేటర్ కోతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి లకు కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకుడు కోతపల్లి ఉపేందర్ రెడ్డి, సత్యనారాయణ, భాస్కర్ గౌడ్, లడ్డూ, శ్యామ్, పరాస్ జైన్, ఆకారం సాయి, అభినవ్ గుప్తా, సుధర్శిణి, ధన లక్ష్మి, శుభ మెనన్, మరియో తదితర కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



# పల్లె దవాఖానాలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన సదస్సు

- డా. ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం
- ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని స్వర్ణరాజ్ శివమణి పిలుపు

**కాప్రా, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పల్లె దవాఖానాలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. డా. ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, ప్రభుత్వం అందుబాటులో ఉంచిన పల్లె దవాఖాన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరికీ చేరువలో ఉన్న ఈ ఆరోగ్య కేంద్రాలను ఉపయోగించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే నివారించవచ్చని పేర్కొన్నారు. డా. ప్రసన్న కుమారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పల్లె దవాఖానాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులతో పాటు సాధారణ ప్రజలకు కూడా ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాలను వినియోగించుకోవాలని, స్థానిక నాయకులు, బస్తీ పెద్దలు ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపియుపిఎస్ కాప్రా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. మహేష్, గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. సత్యనారాయణ, స్థానికులు జి. సత్తయ్య, ఎన్. కుమార్, మనోజ్, ఏఎన్ఎం మంజుల, ఆశా వర్కర్లు రాధిక, వాణి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# రిజర్వాయర్లపై రాజకీయ రాద్ధాంతం అనవసరం

**-- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి,ఏప్రిల్ 8(తెలంగాణ ముచ్చట్లు): రిజర్వాయర్ల పేరుతో కొందరు రాజకీయ రాద్ధాంతం చేస్తున్నారని, వాస్తవాలను వక్రీకరిస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గొల్లపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి జీవో తీసుకువచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించిన ఆయన, అదే నాయకులు ఇప్పుడు వ్యతిరేకంగా మాట్లాడడం విడ్డూరమన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ వనపర్తిలో ఉన్నప్పటికీ, అక్కడి రైతులకు నీరు అందే పరిస్థితి లేదని పేర్కొన్నారు.రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పిన నాయకులు స్పష్టమైన ప్రణాళికలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులనే ప్రస్తుతం అమలు చేస్తున్నామని, కొత్తగా ఏమీ చేయలేదని స్పష్టం చేశారు.వనపర్తి నియోజకవర్గానికి అవసరమైన గొల్లపల్లి, బుద్ధారం తదితర రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనవసర ధర్నాలు చేయడం కంటే ప్రభుత్వానికి వినతులు ఇవ్వడం సమంజసమని సూచించారు. సమావేశంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతానికి పీఏసీ కీలకం

**వనపర్తి,ఏప్రిల్8(తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా రాజకీయ వ్యవహారాల కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే పార్టీ దీర్ఘకాలం అధికారంలో ఉంటుందని అన్నారు.గ్రామాల్లో ఓటర్ల సమస్యలు పరిష్కరించి మద్దతు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరినప్పుడే ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ, రాజకీయ వ్యవహారాల కమిటీ ఏర్పాటు జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. రాజకీయ పరిస్థితులపై నివేదికలు సిద్ధం చేసి వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే వేదికగా ఇది పని చేస్తుందని చెప్పారు.ఎన్నికల టికెట్లు, రిజర్వేషన్లు వంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ఈ కమిటీ ముఖ్యపాత్ర పోషిస్తుందని వివరించారు.కమిటీలో 17 మంది సభ్యులు ఉంటారని తెలిపారు.అలాగే పార్టీ విస్తరణలో భాగంగా బూత్ స్థాయి బాధ్యులను త్వరగా నియమించాలని, జిల్లా కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు .ఈ నెల 30న జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సమావేశంలో ఎంపీ మల్లు రవి, మంత్రి వాకిటి శ్రీధర్, ఎమ్మెల్యేలు మేఘా రెడ్డి,మధుసూదన్ రెడ్డి,చిన్నారెడ్డి,శివసేనారెడ్డి,పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# హరీష్ రావు సభకు న్యాయస్థానం అనుమతి ప్రజాస్వామ్యానికి శుభపరిణామం

- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,ఏప్రిల్8(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి గొల్లపల్లి హరీష్ రావు సభ నిర్వహణకు న్యాయస్థానం అనుమతి ఇవ్వడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సభలకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజల ప్రాథమిక హక్కులను హరించడం అవుతుందని విమర్శించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సమావేశాలు, నిరసనలు ప్రజాస్వామ్యంలో హక్కులని, వాటిని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేయాలని, ప్రజాధనం వృథా కాకుండా కాపాడడం తమ లక్ష్యమని తెలిపారు.హరీష్ రావు పర్యటనతో ప్రభుత్వం గుబులు పడుతోందని, రైతుల సమస్యలపై పోరాటాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. రైతుల దీక్షలకు సంఘీభావం తెలుపుతూ, వారికి పూర్తి మద్దతు ఇస్తామని పేర్కొన్నారు.గొల్లపల్లి సభకు ముందుగా అనుమతి ఇచ్చి, తరువాత రద్దు చేయడం పోలీసుల తీరుపై సందేహాలు కలిగిస్తోందని అన్నారు. ప్రతిపక్షం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రాజెక్టుల పేరుతో భూసేకరణలో ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రజల ఏకాభిప్రాయం తప్పనిసరి అని పేర్కొన్నారు. గతంలో చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా సాగునీటి విస్తీర్ణం పెరిగిందని, రైతులకు మేలు జరిగిందని గుర్తు చేశారు.సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**
- **ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్**

**భీమదేవరపల్లి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**





రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ పోలీస్ సిబ్బంది సీపికి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. స్టేషన్‌ను సందర్శించిన సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై వారి పనితీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, విధుల్లో క్రమశిక్షణతో పాటు ప్రజలకు సేవాభావంతో పని చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరుగుతున్న మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసులకు సూచించారు.

అలాగే యువతలో డ్రగ్స్ వినియోగం పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రాష్ట్ర పోలీస్ శాఖ చేపడుతున్న “అరైవ్ అలైవ్” (Arrive Alive) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ పరిమితులను పాటించడం వంటి అంశాలపై ప్రచారం చేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ నియమాల పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించాలని అన్నారు.

ఇంకా పోలీస్ స్టేషన్ రికార్డులను సీపీ పరిశీలించి, గ్రామాల హిస్టరీ షీట్లు మరియు నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీస్ సిబ్బంది తరచూ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సన్నిహితంగా ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎలకతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీ తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

- **ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సేవలపై సమీక్ష**
- **రికార్డులు, బాలింతల పరిస్థితిపై ఆరా**

**మేడ్చల్ మల్కాజ్గిరి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**





ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు.

ఆసుపత్రి హాజరు పట్టికలు, మందుల నిల్వ రిజిస్టర్లు, రోగుల చికిత్స రికార్డులను పరిశీలించిన అదనపు కలెక్టర్, రికార్డుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను హెచ్చరించారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలతో మాట్లాడి, వారికి అందుతున్న పౌష్టికాహారం, వైద్య సేవలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై వివరాలు తెలుసుకున్నారు. శిశువుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం వైద్యుల బాధ్యత అని పేర్కొన్న ఆయన, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పెబ్బేరు లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వనపర్తి,ఏప్రిల్8(తెలంగాణ ముచ్చట్లు):**

రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి పేర్కొన్నారు.పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెబ్బేరు పరిసర ప్రాంతాల రైతుల సౌకర్యార్థం ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సంప్రదించి, పెబ్బేరు లో తొలిసారిగా ఈ కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు.మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర అందిస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదినిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# కీసరలో భారీ ఆస్తి మోసం కేసు బహిర్గతం

- **నకిలీ రిజిస్ట్రేషన్‌లతో ప్లాట్ బదిలీలు**
- **నలుగురు అరెస్ట్, మరికొందరిపై అనుమానం**

**కీసర, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని సంచలనాత్మక ఆస్తి మోసం కేసు వెలుగులోకి వచ్చింది. నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి అసలు యజమానికి తెలియకుండా ఒకే ప్లాట్‌ను పలుమార్లు బదిలీ చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.పోలీసుల వివరాల ప్రకారం, బఘ్ అంబర్‌పేట్‌కు చెందిన గౌటి రాజమ్మ (72) 1991లో రాంపల్లి గ్రామంలోని దయానంద్ ఆఫీసర్స్ కాలనీలో ప్లాట్ నెం.236 (200 గజాలు)ను చట్ట బద్ధంగా కొనుగోలు చేసి స్వాధీనంలో ఉంచుకున్నారు. అయితే ఆమె అల్లుడు గడ్డం గోపాల్ (ఏ 1), తన కుమారులు వినయ్ (ఏ 2), సాయి కిరణ్ (ఏ 3)లతో కలిసి ఆస్తిపై అక్రమంగా హక్కు సాధించేందుకు కుట్ర పన్నాడు.ఈ క్రమంలో 2015లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్ సహకారంతో నకిలీ వ్యక్తిని యజమానిగా చూపించి సేల్ డీడ్ నమోదు చేయించుకున్నారు. అనంతరం 2016లో ఎజిపిఎ, 2017లో సేల్ మరియు గిఫ్ట్ డీడ్‌ల రూపంలో పలుమార్లు బదిలీలు జరిపి, చివరకు 2020లో మరొకరికి విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. సీఐడీ హైదరాబాద్ ఫింగర్ ప్రింట్ బ్యూరో నివేదికలో అసలు యజమాని వేలిముద్రలు నకిలీ పత్రాలతో సరిపోలకపోవడం, గోపాల్ వేలిముద్రలు సరిపోవడం కేసులో కీలక ఆధారంగా నిలిచింది. మొత్తం ఏ 1 నుంచి ఏ 14 వరకు నిందితులు కలిసి కుట్ర పన్ని ఈ మోసానికి పాల్పడ్డట్లు పోలీసులు వెల్లడించారు.ఈ నేపథ్యంలో 08042026న గడ్డం గోపాల్ (ఏ 1), వినయ్ (ఏ 2), సాయి కిరణ్ (ఏ 3), శ్రీనివాస్ రెడ్డి (ఏ 10)లను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

**ప్రజలకు సూచనలు:**

ఆస్తి కొనుగోలు ముందు యజమాని వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు పూర్తిగా ధృవీకరించుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో స్వయంగా హాజరై బయోమెట్రిక్ వివరాలు పరిశీలించాలి.అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# కాప్రాలో నూతన పెన్షన్‌లపై ఎమ్మెల్యే బండారి సమీక్ష

- **లబ్ధిదారులకు వెంటనే పెన్షన్‌లు అందించాలని అధికారులకు ఆదేశాలు**

**కాప్రా, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాప్రా మున్సిపల్ కార్యాలయం వద్ద నూతన పెన్షన్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్యాలయాన్ని సందర్శించి పెన్షన్ దరఖాస్తుల వివరాలను పరిశీలించారు.ప్రజలతో నేరుగా మాట్లాడిన ఆయన, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెన్షన్‌లు ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పారదర్శకంగా అమలు చేయాలని, పెన్షన్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.



## సిర్పపల్లి డంపింగ్ యార్డ్‌పై ఆందోళన ఉద్ధృతి

- కలెక్టర్‌ను కలిసిన ప్రణవ్
- ర్యాలీలతో రగిలిన రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



**హుజురాబాద్ ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం సిర్పపల్లి వద్ద ప్రతిపాదించిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ డంపింగ్ యార్డ్ రైతులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసి సమస్యను వివరించి, జనవాసాల మధ్య కాకుండా ప్లాంట్‌ను దూర ప్రాంతానికి తరలించాలని వినతి పత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ప్రణవ్ తెలిపారు.

ఇక డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసనలు మరింత వేగం పుంజుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో స్థానిక పెన్షనర్ భవనం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నినాదాలతో మారుమోగించారు. హుజురాబాద్‌ను డంపింగ్ యార్డ్ ముప్పు నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులు గళమెత్తారు. జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలకు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేపట్టిన నిరాహార దీక్షకు రిటైర్డ్ ఉద్యోగులు సంఘీభావం తెలపడం ఉద్యమానికి మరింత ఊపును తీసుకొచ్చింది. ప్రజలు, వివిధ వర్గాలు ఒక్కటై పోరాటం కొనసాగిస్తుండటంతో సమస్య తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది.



## బ్లూ బ్లాక్ గ్రీన్ షర్ట్స్ కవాతును విజయవంతం చేయాలి

**-మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్,ఏప్రిల్08(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న బ్లూ బ్లాక్ గ్రీన్ షర్ట్స్ కవాతును విజయవంతం చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను మంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించబడుతోంది.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను సాధించడంలో భాగంగా పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుంచి ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.పిడమర్తి రవి మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు కవాతు ప్రారంభమవుతుందని, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దళితుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ మాట్లాడుతూ, దళితుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దాదాపు 76 సంవత్సరాలు గడిచినా దళితులు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించిన ప్రకారం దళితులకు బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, ఆ మేరకు నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు. కేటాయించిన నిధులను ఇతర శాఖలకు మళ్లించడం అన్యాయమని అన్నారు. దేశం, రాష్ట్రాల్లో దాదాపు 80 శాతం ఎస్సీ దళిత కుటుంబాలు ఇంకా ఇళ్లు లేక జీవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇందిరమ్మ ఇళ్లలో కనీసం 50 శాతం వాటాను దళితులకు పారదర్శకంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాలను కోరారు. ఈ నెల 17, 18 తేదీలలో వరంగల్ పట్టణంలోని అబ్బున్స్ ఫంక్షన్ హాల్, పోచమ్మ మైదానంలో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలకు హనుమకొండ జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల స్థాయి నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మరి శ్రీనివాస్, శనిగరపు రాజకుమార్, సిపిఐ మండల సీనియర్ నాయకులు తండ ముండయ్య, ప్రకాష్, రాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం.!

- దిశా సమావేశంలో ఎంపీ రఘురాం రెడ్డి స్పష్టం

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేసి, సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా చూడాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన దిశా సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ సహాధ్యక్షులుగా పాల్గొన్నారు. నాలుగు గంటల పాటు సాగిన సమావేశంలో వివిధ శాఖల పనుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, గత నిర్ణయాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీ స్పష్టం చేశారు. పనుల పురోగతిపై శాఖలు నిరంతరం నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర నిధుల వాటా తగ్గిన నేపథ్యంలో రాష్ట్రంపై భారం పెరిగిందని ఆయన తెలిపారు. గృహ నిర్మాణంలో మార్పుల వల్ల పేదలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర పథకాలు గ్రామీణాభివృద్ధికి కీలకమని, లబ్ధిదారులకు సమయానికి ప్రయోజనాలు చేరేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, వైద్యం, విద్యుత్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, సదుపాయాల మెరుగుదలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల కింద తాగునీటి సరఫరా లోపాలు సరిదిద్దాలని తెలిపారు. జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, విద్యుత్ పనుల్లో ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐటీడీఏ పనులపై నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల వరకు తాగునీరు అందించాలని, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. కలెక్టర్ అంకిత్ శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్

- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 8(తెలంగాణ ముచ్చట్లు)**

ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. నగరంలో సరైన నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలు పాల్పడి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ముమ్మర తనిఖీ చెప్పటారు. సరైన నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ వద్ద వాహనదారులకు 14 వేల రూపాయలు, రాంగ్/ అపోజిట్ డ్రవింగ్ చేస్తున్న వాహనాలకు 17 వందల రూపాయలు వరకు జరిమానా విధించి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, సరైన నెంబర్ ప్లేట్లు తెచ్చుకొని అమర్చిన వాహనాలకు వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యంగా రోడ్లపై వాహనాలు నిలపడం ద్వారానే జరుగుతున్నాయని, అదేవిదంగా మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, రోడ్లపై తిరిగే వాహనాలకు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. పెండింగ్ ఛానళ్లు చెల్లించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న ట్రాఫిక్ నిబంధనలకు ప్రజలు సహకరించాలని కోరారు.



## పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని షటిల్ బ్యాడ్మింటన్ కోర్ట్ ప్రారంభించిన పోలీసు కమిషనర్

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 8(తెలంగాణ ముచ్చట్లు)**

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.

ఖమ్మం పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా సిటీ అర్మడ్ పోలీస్ హెడ్ క్వాటర్స్ ఆవరణలోని ఇటీవల ప్రారంభమైన స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మితమైన షటిల్ బ్యాడ్మింటన్ కోర్ట్ ను బుధవారం పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...పోలీస్ కుటుంబాల కోసం ఆధునిక సౌకర్యాలు, శిక్షణ, కోచింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మానసిక ఉల్లాసంతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. అదేవిదంగా శారీరక దారుఢ్యం కోసం షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును పోలీసు సిబ్బందికి అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం ఇటువంటి సౌకర్యాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంలో అహర్నిశలు కష్టపడి పనిచేసిన పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందిస్తూ ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు (ఏఆర్) కుమారస్వామి, విజయబాబు, ఏఆర్ ఏసిపి లు సుశీల్ సింగ్, నర్సయ్య, ఎస్బి ఏసిపి మహేష్, సిసిఎస్ ఏసీపీ సర్వర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం,సాంబశివరావు సురేష్, నాగుల్ మీరా, ఇన్స్పెక్టర్లు రాజిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## స్మార్ట్ కిడ్జ్ లో సంబురంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల ఫోటోలతో మెమెంటోల బహుకరణ

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 8(తెలంగాణ ముచ్చట్లు)**

స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బుధవారం ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సంబరంగా జరిగాయి. గత తొమ్మిది సంవత్సరాలుగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని చివరి ప్రైమరీ విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు.ప్రైమరీ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రత్యేక గ్రాడ్యుయేషన్ వస్త్రధారణలో నెత్తిపై గ్రాడ్యుయేషన్ టోపీ ధరించి ఈ వేడుకలలో నేత్రపర్వంగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యార్థుల ఫోటోలతో మెమెంటోలు బహుకరించడంతో వారి ఫోటోలతో ఉన్న మెమెంటోను అందుకున్న విద్యార్థులు మురిసిపోయారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్లే గ్రూపులో చేరిన విద్యార్థులు, గత 9 సంవత్సరాలుగా విద్యార్థులు పాఠశాలలో అన్ని తరగతులను పూర్తి చేసుకుని ఐదవ తరగతిలో గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకోవడం హర్షనీయమన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చదువుతోపాటు క్రీడా,సాంస్కృతిక, ఒలంపియాడ్, ఇన్స్పైర్‌సైన్స్ ఎక్స్పో, మహనీయుల జయంతోత్సవాలు, పర్వదినాలు, వార్షికోత్సవాలు నిర్వహించి విద్యార్థులను ఆల్రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. తమ పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూ తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని, ఇదే విధంగా భవిష్యత్తులోనూ తమ పాఠశాలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.







## సీఎం సహాయనిధి పేదల జీవితాల్లో వెలుగులు

- జగన్నాధపురం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కే శ్రీనివాస్

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని జగన్నాధపురం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కే శ్రీనివాస్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.26వేల విలువ గల చెక్కును లబ్ధిదారు పంజాల రాణికి బుధవారం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెండ్యాల కుమారస్వామి, ఆరెపల్లి సమ్మయ్య, ఆరెపల్లి చిరంజీవి, మాజీ ఉపసర్పంచులు ఆరెపల్లి సమ్మయ్య, ఆరెపల్లి రమేష్, మాజీ వార్డు సభ్యులు పెండ్యాల భాస్కర్, పెండ్యాల సామేల్, బండి కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాల మధు, గూటం శ్రీనివాస్ రెడ్డి, జి.ఎస్. రెడ్డి, మాటూరి శ్రీనివాస్, శివరాత్రి మల్లయ్య, ఆరెపల్లి ఎల్లయ్య, కంసారపు సంపత్, పెండ్యాల పౌలు, ఆరెపల్లి కళ్యాణ్, ఎస్.డి. హుస్సేన్, ఎస్.డి. కరీం, మేకల రాజు, హుస్నాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పంజాల అభిలాష్, పెండ్యాల రాజేష్, పంజాల అజయ్, కస్తూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## మంత్రి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ చొరవ

- మహాలక్ష్మి వెంచర్ ఏరియా లో తీరిన లో-వోల్టేజ్ సమస్య

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 08(తెలంగాణ ముచ్చట్లు)** ఎదులాపురం మున్సిపాలిటీ 13వ డివిజన్ పరిధిలోని మహాలక్ష్మి వెంచర్ ఏరియాలో వాసుల ఏళ్లనాటి విద్యుత్ కష్టాలకు తెరపడింది. గత ఏడాది కాలంగా లోవోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికుల విన్నపం మేరకు, నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది.

**యుద్ధప్రతిపాదికన పరిష్కారం:**

మహాలక్ష్మి వెంచర్‌లో విద్యుత్ సరఫరా సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 13వ వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే ఈ సమస్యను రాష్ట్ర మంత్రి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ దయాకర్ రెడ్డి మరియు ముద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు వద్దకు తీసుకెళ్లారు. స్పందించిన దయాకర్ రెడ్డి కేవలం ఒక్క ఫోన్ కాల్‌తో విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసి, సమస్యను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై, పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, 13వ వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు, 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ, 8వ వార్డు కౌన్సిలర్ సంఘాన్ని సుశీలమ్మ తనయుడు వెంకట్, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు షేక్ నజీరుద్దీన్, హనుమంతరావు, కృష్ణ,పంతంగి వేణుగోపాల్ మరియు విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను అతి తక్కువ సమయంలో పరిష్కరించినందుకు వెంచర్ ఏరియా నివాసితులు దయాకర్ రెడ్డి కి మరియు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత సీసీ కెమెరాల ఏర్పాటు

- మిలన్ గ్రూప్ సేవలకు ప్రశంసలు
- భద్రత కోసం కెమెరాలు అవసరం: సీఐ ఆంజనేయులు

**కీసర, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం చీర్యాల ప్రభుత్వ పాఠశాలలో మిలన్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కీసర సీఐ ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి కెమెరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని, నేరాల నియంత్రణలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని అన్నారు.మిలన్ గ్రూప్ ప్రతినిధి అజ్జు మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, సమాజ భద్రత కోసం అందరూ సహకరించాలని సీఐ సూచించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల కృష్ణ, బీజేపీ నాయకుడు తిరుమల్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రాబోయేది కేసీఆర్ ప్రభుత్వ మే..

- కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలకు విసిగి వేసారిన ప్రజలు..
- ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్...
- ఏప్రిల్ 19న ఖమ్మంలో మినీ ప్లీనరి.. హాజరుకానున్న తన్నీరు హరీష్ రావు..

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 8(తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో పువ్వాడ అజయ్ కుమార్ గారు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ దాటికి తట్టుకోలేక అధికార పార్టీ సస్పెండ్ చేసే స్థాయికి దిగజారిందని ఏద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలు హామీలు నెరవేర్చలేక బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను తమ పనులుగా చూపించుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. గత ఎన్నికల్లో వ్యక్తిత్వ హననం చేసి రెండు మూడు రోజులు ముందుగా వచ్చి అధికారం లోకి వచ్చారు.కేసీఆర్ మీద నా మీద చెడు ప్రచారం చేసి పబ్బం గడుపుకున్నారు నిజం నవాబ్ కాలంలో ఖాసీం రిజ్వి లాగా పాలించారు అన్నారు.ఇప్పుడు వెలుగుమట్లను గాజాగా చేశారని దుయ్యబట్టారు. మట్టి గుట్టలు అమ్ముకున్నాడని ఎన్నో నిందలు వేశారు మరి ఇప్పటి వరకు ఏమి నిరూపించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గుట్టలన్ని మాయం అయ్యాయి దానికి ఏమి సమాధానం చెపుతారు అని డిమాండ్ చేసారు.

మన రాష్ట్రంలో చేసింది ఏమి లేదు కేరళ వెళ్ళి నేను మీకు అండగా ఉంటా అన్న రేవంత్ రెడ్డికి కేరళ సీఎం పినరాయి విజయన్ గట్టి బుద్ధి చెప్పారు. మన ఖమ్మం వెలుగుమట్ల ఇళ్ళు కూల్చడం దారుణం అని విజయన్ ట్విట్టర్ లో కూడా పోస్ట్ చేశారు. 1/70 లో ఉన్న భూములు కూడా మంత్రులు ఎలా కొనుకొన్నారు. హైదరాబాద్ చుట్టూ భూములు ఆక్రమించుకుంటూ పేదలను పెద్దవారిని ఎవరిని వదలకుండా రౌడీలతో బెదిరిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర ఏళ్ళు అయింది వచ్చి ఒరగబెట్టింది ఏమి ప్రజలకు అర్ధం అయింది..వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ,మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జే సి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,టేకులపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి,

కార్పొరేటర్ మక్బుల్,దండా జ్యోతిరెడ్డి,పల్లా రోజ్లీనా,కూరాకుల వలరాజు,బుర్రి వెంకటేశ్వర్లు, మాటేటి నాగేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం,మండల అధ్యక్షుడు వీరు నాయక్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి,పోట్ల శ్రీకాంత్,సిరిపురపు సుదర్శన్,ఎర్రా అప్పారావు,కోప్పర నరసింహారావు,వల్లభనేని రామారావు,నగర మైనారిటీ అధ్యక్షుడు షంసుద్దీన్,ఎస్ టీ సెల్ అధ్యక్షుడు సురేష్,ప్రచార కార్యదర్శి షకీనా,సర్పంచ్ కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పెంట్యా,మూర్తి,మాటేటి కిరణ్,ధనలక్ష్మి, మాజీ సర్పంచ్లు,మాజీ ఎంపిటిసిలు నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 8(తెలంగాణ ముచ్చట్లు)**





బిఆర్ఎస్ నాయకులు ఖయుమ్ తల్లి రాబియా బేగం నిన్న అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ కార్పొరేటర్ పాలడుగు పాపారావు తండ్రి సత్యం గారు ఇటీవల అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మిర్చి శాఖా సెక్రటరీ ఎడ్లపల్లి సతీష్ సతీమణి స్వాతి గారు నిన్న అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, టేకులపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్ మక్బుల్, నాగండ్ల కోటేశ్వరరావు,బిక్కసాని జస్వంత్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి,నాయకులు మెంతుల శ్రీశైలం,మందడపు రామకృష్ణ, ఎర్రా అప్పారావు,దడాల రఘు,యూత్ అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్,మాటేటి కిరణ్ ప్రచార కార్యదర్శి షకీనా,ఉస్మాన్, మస్తాన్,లెలిన్ చౌదరి,పోటు శరత్,వెంకటేశ్వర్లు,తిరుపతయ్య, రమేష్,రాజు,మల్లేశం,నారుమళ్ళ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సిటీ గ్యాస్ విస్తరణకు వేగం

- ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పిఎన్జీ వినియోగంపై దృష్టి
- మూడు మున్సిపాలిటీల్లో పైపులైన్ పనులకు త్వరిత అనుమతులు

**మేడ్చల్ మల్కాజ్గిరి, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు)**




మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన "జిల్లా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ కమిటీ" సమావేశం బుధవారం (ఏప్రిల్ 8) సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గృహ, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులను ఎల్పీజీ నుంచి పిఎన్జీ (పైపుల ద్వారా సరఫరా అయ్యే సహజ వాయువు) వినియోగం వైపు మళ్లించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీనివల్ల సురక్షితమైన, నిరంతర గ్యాస్ సరఫరా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జిల్లాలోని మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీల పరిధిలో మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పైపులైన్ విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో, సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఆలస్యం లేకుండా మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే, జిల్లా కమిటీ సభ్యులు, అధికారులు, మెగా గ్యాస్ ప్రతినిధులతో కలిసి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, అందులో వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించి అనుమతులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఉన్నత పోలీసు అధికారులు, జిల్లా అటవీ అధికారి, పీడీ, ఎన్‌హెచ్ఏఐ, డీజీసీజీఎం, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్&బి, పీఆర్ & ఆర్ శాఖల ఎస్ఈలు, ట్రాన్స్‌కో అధికారులు, మున్సిపల్ కమిషనర్లు (మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట) మరియు మెగా గ్యాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈసీఐఎల్ చౌరస్తాలో వాహనాలపై పోలీసుల కఠిన తనిఖీలు

- 350 వాహనాల చెకింగ్... పత్రాలు లేనివి సీజ్, రూ.50 వేల చలాన్లు వసూలు

**కుషాయిగూడ, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):**





మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ ఉప్పల్ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు భారీ స్థాయిలో నాకాబంది నిర్వహించారు. కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కుషాయిగూడ, ఉప్పల్, నాచారం పోలీస్ సిబ్బంది మరియు ఏఆర్ బలగాలు కలిపి సుమారు 100 మంది ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా టూవీలర్లు, త్రీ వీలర్లు, ఫోర్ వీలర్లు కలిపి మొత్తం 350 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకుని, నెంబర్ ప్లేట్లు లేని 7 వాహనాలను పోలీసులు డీటెయిన్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న వాహన చలాన్లను వసూలు చేసి మొత్తం రూ.50,000 రాబట్టినట్లు అధికారులు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- -పెద్దపెండ్యాలలో బడిబాట కార్యక్రమం
- -ఇంటిఇంటికి వెళ్లిన ఉపాధ్యాయుల బృందం

**ధర్మసాగర్,ఏప్రిల్08(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్ద పెండ్యాల గ్రామంలో విద్యార్థుల చేర్పులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొద్దిరెడ్డి భగవాన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరించారు. మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి మూడు కోడిగుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ విద్యాసంవత్సరం నుంచి టై, బెల్ట్, బ్యాడ్జ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితరంగా మొత్తం 21 రకాల వస్తువులను ప్రభుత్వం అందిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నామని చెప్పారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ కలిగిన పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దుతామని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. దీనికి స్పందించిన గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ రణాప పాల్గొన్నారు.





# ఎన్టీఆర్-నీల్ షూటింగ్‌పై క్లారిటీ

యంగ్ టైగర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ రద్దయిందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమా షూటింగ్ నిలిపివేశారని, ఎన్టీఆర్ కొత్త రూపం విషయంలో అసంతృప్తితో కార్యక్రమాలు ఆగిపోయాయని ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రచారాలపై స్పందించిన నిర్మాణ సంస్థ, సినిమా చిత్రీకరణ సాధారణంగానే కొనసాగుతోందని తెలిపింది. ప్రస్తుతం తీసుకున్న విరామం తదుపరి భారీ కార్యక్రమాల కోసం చేసే సన్నాహాల కోసమేనని వెల్లడించింది. ఎన్టీఆర్ రూపం గురించి వస్తున్న వార్తలు పూర్తిగా ఆధారరహితమని పేర్కొంది. అధికారిక సమాచారం కోసం తమ ప్రకటనలనే నమ్మాలని చిత్రబృందం విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే ఈ చిత్రం విదేశీ ప్రాంతాల్లో కీలక దృశ్యాలను పూర్తి చేసుకుంది. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి ఎన్టీఆర్ ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం తదుపరి కార్యక్రమాల కోసం చిత్రబృందం సిద్ధమవుతోంది.

# బ్రేకప్‌పై కృతి ఓపెన్

నటి కృతి శెట్టి తాజాగా చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. ప్రేమ, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడిన ఆమె, తాను ప్రస్తుతం ఒంటరిగా ఉన్నానని తెలిపారు. గతంలో ఒకసారి ప్రేమ విఫలమైందని, ఆ విషయం తన తల్లికి కూడా తెలుసని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.

ఉప్పెన చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కృతి శెట్టి తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత వరుస విజయాలతో తక్కువ సమయంలోనే ప్రముఖ నటిగా ఎదిగింది. అయితే అనంతరం వచ్చిన కొన్ని చిత్రాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఆమె సినిమాల వేగం కొంత తగ్గింది. ప్రస్తుతం ఇతర భాషల చిత్రాల్లో అవకాశాలు అందుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

ఇటీవల ఒక సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కృతి తన వ్యక్తిగత విషయాలపై స్పందించింది. తన జీవితంలో జరిగిన బ్రేకప్ గురించి స్పష్టంగా చెప్పడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. అదే సమయంలో తనపై అనవసర విమర్శలు చేస్తే సామాజిక మాధ్యమాల్లో అడ్డుకుంటానని హెచ్చరించింది. వ్యక్తిగత విషయాలను గౌరవించాలని కోరింది.

ప్రస్తుతం కృతి శెట్టి కొత్త చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. తన నటనతో మళ్లీ విజయాలను అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ యువ నటి, భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలతో మెప్పించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది.





# సాయి మార్తాండ్ కొత్త సినిమా ప్రకటన

చిన్న బడ్జెట్ సినిమాతో భారీ విజయాన్ని అందుకుని సినీ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు సాయి మార్తాండ్ తన తదుపరి చిత్రంతో మరోసారి చర్చనీయాంశంగా మారాడు. తక్కువ ఖర్చుతో రూపొందించిన 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, ఇప్పుడు మరింత పెద్ద స్థాయిలో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నాడు.

రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమైన 'లిటిల్ హార్ట్స్' చిత్రం దాదాపు ముప్పై కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. ఈ విజయంతో సాయి మార్తాండ్ పేరు సినీ వర్గాల్లో విస్తృతంగా వినిపించింది. భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇస్తూ, సాధారణ కథను ఆసక్తికరంగా చెప్పే ఆయన శైలి ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

తాజాగా తన తదుపరి చిత్రంపై ఆయన స్పష్టత ఇచ్చాడు. ప్రముఖ నటుడు అడివి శేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు వెల్లడించాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'గూఢచారి 2' పూర్తయ్యాక ఈ చిత్రం ప్రారంభమవుతుందని తెలిపాడు. ఈ కథ ప్రేమ నేపథ్యంలో సాగుతుందని చెప్పడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ చిత్రానికి సంబంధించి మరో ముఖ్య అంశం నిర్మాతల ఎంపిక. ప్రముఖ నటులు జగపతి బాబు, సునీల్ ఈ సినిమాతో నిర్మాతలుగా మారుతున్నారు. ఇప్పటివరకు నటులుగా మంచి గుర్తింపు పొందిన ఈ ఇద్దరు ఇప్పుడు నిర్మాణ రంగంలో అడుగు పెట్టడం విశేషంగా భావిస్తున్నారు. ఇది వారి కెరీర్‌లో ఒక కొత్త దశగా భావించవచ్చు.

సాయి మార్తాండ్ కథనశైలికి తగ్గట్టుగా ఈ చిత్రం భావోద్వేగాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉండే అవకాశముందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు థ్రిల్లర్ కథలతో గుర్తింపు పొందిన అడివి శేష్ ఈసారి ప్రేమకథలో నటించడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది.

మొత్తానికి, చిన్న సినిమాతో పెద్ద విజయాన్ని అందుకున్న సాయి మార్తాండ్ ఇప్పుడు ప్రముఖ నటులతో కలిసి మరింత భారీ స్థాయిలో తన ప్రతిభను చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ కొత్త కాంబినేషన్ ఎలా ఉంటుందో, ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.



# లెనిన్ విడుదల తేదీ ఖరారు

టాలీవుడ్‌లో భారీ సినిమాల విడుదల తేదీలు వరుసగా మారుతూ ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక సినిమా వాయిదా పడితే మరొక సినిమాపై ప్రభావం చూపుతూ ఈ పరిస్థితి కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల చిత్రాల మధ్య పోటీ, షూటింగ్ ఆలస్యాలు కారణంగా విడుదల తేదీల్లో గందరగోళం నెలకొంటోంది.

ఈ నేపథ్యంలో అఖిల్ నటిస్తున్న 'లెనిన్' చిత్రంపై కూడా అనిశ్చితి నెలకొంది. రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీ మార్పులు ఇతర సినిమాలపై ప్రభావం చూపాయి. మొదట మార్చి 27న విడుదల చేయాలని భావించిన ఆ చిత్రాన్ని షూటింగ్ ఆలస్యాల కారణంగా ఏప్రిల్ 30కు మార్చారు. అయితే ఆ తేదీ కూడా సాధ్యం కాదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ అనిశ్చితి కారణంగా ఇతర సినిమాల ప్రణాళికలు కూడా మారాల్సి వచ్చింది.

మొదట 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదల అవుతుందనే కారణంతో 'లెనిన్' చిత్రాన్ని వాయిదా వేశారు. అయితే ఇప్పుడు 'పెద్ది' మళ్లీ వాయిదా పడే పరిస్థితి ఉన్నప్పటికీ, 'లెనిన్' అదే తేదీకి రావడం సాధ్యం కాదని చిత్రబృందం భావించింది. ఈ నేపథ్యంలో అఖిల్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రబృందం కొత్త పోస్టర్ విడుదల చేస్తూ జూన్ 26న సినిమా విడుదల అవుతుందని అధికారికంగా ప్రకటించింది. దీంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అభిమానులు ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల అవుతుందని ఆశించినప్పటికీ, అది జరగకపోవడంతో కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే విడుదల తేదీ ప్రకటనతో సినిమాపై మళ్లీ చర్చ ప్రారంభమైంది. ఈ చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ'తో గుర్తింపు పొందిన మురళీ కృష్ణ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నాడు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన శీర్షిక దృశ్యాలు, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి.

ప్రముఖ నటుడు శివాజీ కీలక పాత్రలో కనిపించనున్నాడు. సంగీతాన్ని తమన్ అందిస్తుండగా, మనం ఎంటర్‌ప్రైజెస్ మరియు సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాణ బాధ్యతలు చేపట్టడం విశేషం. హీరోగా అఖిల్ ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో 'లెనిన్' చిత్రం అతని కెరీర్‌కు కీలకంగా మారనుంది. మంచి కథ, బలమైన నిర్మాణంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాల్సి ఉంది.



# కీర్తిపై సమంత క్లారిటీ

స్టార్ నటి సమంత తాజాగా మరో నటి గురించి చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం సినిమాలతో పాటు నిర్మాణ రంగంలోనూ బిజీగా ఉన్న ఆమె, సహనటి కీర్తి సురేష్‌పై వస్తున్న ప్రచారాలపై స్పందించారు. ఇటీవలి కాలంలో కీర్తి సురేష్ మద్యం సేవిస్తుందనే వదంతులు సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న నేపథ్యంలో సమంత స్పష్టత ఇచ్చారు. కీర్తి సురేష్‌కు అలాంటి అలవాటు ఏదీ లేదని, ఆ వార్తల్లో నిజం లేదని ఆమె తెలిపారు. అయితే కీర్తి సురేష్‌కు మరో ప్రత్యేక అలవాటు ఉందని సమంత వెల్లడించారు. ఆమె ఎప్పుడూ ఉత్సాహంగా మాట్లాడుతూ, చుట్టూ ఉన్న వారిని నవ్విస్తూ ఉంటారని చెప్పారు. ఒకసారి మాట్లాడటం ప్రారంభిస్తే ఆపకుండా మాట్లాడుతూనే ఉండటం, సరదాగా పద్యాల్లా మాట్లాడటం ఆమెకు అలవాటని వివరించారు. అర్ధరాత్రి వరకు కూడా చురుకుగా మాట్లాడుతూ అందరిని అలరించగల స్వభావం ఆమెదని సమంత పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# సర్పంచ్ భర్త ఖాతాల్లోకి పంచాయతీ నిధుల మళ్లింపు...

# మతలబేంటి?

**ధర్మసాగర్,ఏప్రిల్08(తెలంగాణ ముచ్చట్లు ):**




గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పనుల పేరిట విడుదలై చివరికి మహిళా సర్పంచ్ భర్తల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి చేరుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇదే విధానం అమలవుతున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తుండటం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తోంది.

రివర్స్ ఓస్మోసిస్ ప్లాంట్ మరమ్మత్తులు, నీటి పనులు వంటి పేర్లతో వేలాది రూపాయలు విడుదలైనప్పటికీ, ఆ మొత్తాలు సంబంధిత కాంట్రాక్టర్లకు కాకుండా కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి వెళ్లినట్టు రికార్డులు సూచిస్తున్నాయి. అధికారికంగా పనులు నిర్వహించిన వారు ఎవరు, చెల్లింపులు పొందిన వారు ఎవరు అన్న విషయంలో స్పష్టత లేకపోవడం అనుమానాలను మరింత పెంచుతోంది.

పంచాయతీ నిధులు వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించడం నిబంధనలకు విరుద్ధమనే విషయం తెలిసినప్పటికీ, ఇలాంటి లావాదేవీలు కొనసాగుతుండడం వెనుక ఉన్న అండదండలు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపమా, లేక ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న వ్యవహారమా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఈ విధమైన చెల్లింపులు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ నిధులు ప్రజల అభివృద్ధి కోసం వినియోగమవుతున్నాయనే నమ్మకాన్ని కాపాడేందుకు పారదర్శకత, బాధ్యతాయుత చర్యలు అత్యవసరమయ్యాయి.

## దేశ రక్షణలో బీఎస్ఎఫ్ జవాన్ల సేవలు అనన్య సామాన్యం: బండి సంజయ్

**అమరవీరులకు నివాళులు అర్పించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి**

**బారాముల్లా, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** భారత సరిహద్దు భద్రతా దళం జవాన్లు దేశ రక్షణలో తొలి వరుసలో నిలబడి పోరాడుతున్న ధీరులని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. జమ్మూ కాశ్మీర్ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన బారాముల్లాలో పర్యటించారు. సరిహద్దుల్లో జవాన్లు అహోరాత్రులు పహారా కాస్తుండటం వల్లే నేడు కాశ్మీర్‌లో శాంతి నెలకొందని, పర్యాటక రంగం పుంజుకోవడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. జవాన్ల త్యాగాలను దేశం ఎప్పటికీ మరువదని, వారి ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. బారాముల్లాలో బీఎస్ఎఫ్ సిబ్బంది కోసం నూతనంగా నిర్మించిన నివాస సముదాయాలను మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. అత్యంత క్లిష్టమైన ఉరి సెక్టార్ నుండి మంచుతో నిండిన పర్వత శ్రేణుల వరకు జవాన్లు ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా క్రమశిక్షణతో విధులను నిర్వహిస్తున్న తీరును ఆయన ప్రశంసించారు. జవాన్ల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, వారికి అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మెరుగైన వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. నివాస సముదాయాల ప్రారంభం ద్వారా జవాన్ల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సరిహద్దు ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు కేటాయించామని, దీనివల్ల రక్షణ దళాల కదలికలు మరింత సులభతరం అయ్యాయని పేర్కొన్నారు. కాశ్మీర్ లోయలో పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, యువత అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని మంత్రి తెలిపారు. శాంతియుత వాతావరణం నెలకొనడం వల్ల పర్యాటకులు భారీగా తరలివస్తున్నారని, ఇది స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోందని చెప్పారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేస్తామని, సరిహద్దు దాటి వచ్చే ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

ఈ పర్యటనలో బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులు మరియు ఇతర భద్రతా బలగాల ప్రతినిధులు మంత్రికి క్షేత్రస్థాయి పరిస్థితులపై వివరించారు. జవాన్లతో కలిసి స్వల్ప సమయం గడిపిన బండి సంజయ్, వారి కష్టసుఖాలను పంచుకున్నారు. నివాస సముదాయాల ప్రారంభోత్సవం అనంతరం జవాన్లకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సరిహద్దుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మరోసారి భరోసా ఇచ్చారు. ఈ పర్యటన జవాన్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కాశ్మీర్ పర్యటనలో భాగంగా మరిన్ని కీలక ప్రాంతాలను మంత్రి సందర్శించనున్నారు. దేశ భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ పర్యటన ద్వారా ఆయన సంకేతాలిచ్చారు.

# సుప్రీంకోర్టు తీర్పులపై కేంద్రం అభ్యంతరం

- 'వివాహ వ్యవస్థకు ముప్పు'
- వ్యభిచారం, స్వలింగ సంబంధాల చట్టబద్ధతపై అఫిడవిట్ దాఖలు
- ఆ నిర్ణయాలు భారతీయ సంప్రదాయ విలువలకు విరుద్ధమని వెల్లడి
- కుటుంబ వ్యవస్థ పవిత్రత దెబ్బతింటుందని కేంద్రం ఆందోళన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో గతంలో సంచలనం సృష్టించిన రెండు చారిత్రక తీర్పులపై కేంద్ర ప్రభుత్వం తాజాగా తన తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. వ్యభిచారాన్ని, స్వలింగ సంబంధాలను నేరాల పరిధి నుంచి తొలగిస్తూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు "మంచి నిర్ణయాలు కావు" అని కేంద్రం అభిప్రాయపడింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఒక అఫిడవిట్ ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ మరియు న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పులు భారతీయ సమాజం, వివాహ వ్యవస్థ మరియు శతాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయిక విలువలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని కేంద్రం తన వాదనలో స్పష్టంగా పేర్కొంది.

వివరాల్లోకి వెళితే, 2018 సంవత్సరంలో సుప్రీంకోర్టు రెండు అత్యంత కీలకమైన తీర్పులను వెలువరించింది. భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 497 కింద వ్యభిచారాన్ని నేరంగా పరిగణించడాన్ని రద్దు చేస్తూ అప్పట్లో ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అదే ఏడాది, మరో ముఖ్యమైన తీర్పులో సెక్షన్ 377ను పాక్షికంగా రద్దు చేయడం ద్వారా, ఇద్దరు వయోజనుల మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడే స్వలింగ సంబంధాన్ని చట్టబద్ధం చేసింది. అప్పట్లో ఈ తీర్పులను పౌర హక్కుల సంఘాలు మరియు సామాజిక కార్యకర్తలు స్వాగతించినప్పటికీ, తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పుల చట్టబద్ధతను మరియు సామాజిక ప్రభావాన్ని ప్రశ్నిస్తూ తన వైఖరిని సుప్రీంకోర్టు ముందు ఉంచింది. మరో వ్యాజ్యం విచారణ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్రం తన ఆందోళనలను విడమర్చి చెప్పింది. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పులు సమాజంలోని సున్నితమైన సమతుల్యతను దెబ్బతీస్తాయని కేంద్రం వాదించింది. ముఖ్యంగా భారతీయ కుటుంబ వ్యవస్థకు మూలస్తంభమైన వివాహ బంధం యొక్క పవిత్రతకు ఈ నిర్ణయాలు భంగం కలిగిస్తాయని అభిప్రాయపడింది. పాశ్చాత్య దేశాల ధోరణులను భారతీయ సమాజంపై రుద్దడం వల్ల సామాజిక కట్టుబాట్లు సడలిపోయే ప్రమాదం ఉందని కేంద్రం తన అఫిడవిట్‌లో హెచ్చరించింది. ఈ పరిణామాలు భవిష్యత్తులో వివాహేతర సంబంధాలు పెరగడానికి దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే దేశం పురోగమిస్తుందని, అయితే అపవిత్రమైన సంబంధాలకు చట్టబద్ధత కల్పించడం వల్ల నైతిక విలువలు పతనమవుతాయని కేంద్రం వాదించింది. స్వలింగ సంపర్కం మరియు వ్యభిచారం వంటి అంశాలు కేవలం వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించినవి మాత్రమే కావని, ఇవి సమాజంపై సుదీర్ఘ ప్రభావం చూపుతాయని పేర్కొంది. వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య ఒప్పందం మాత్రమే కాదని, అది ఒక సామాజిక బాధ్యత అని కేంద్రం గుర్తు చేసింది. ఈ తీర్పుల వల్ల బాధితులుగా మారే మహిళలు మరియు పిల్లల హక్కుల రక్షణ ప్రశ్నార్థకంగా మారుతుందని తన అఫిడవిట్‌లో వివరించింది.

కేంద్రం తీసుకున్న ఈ తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వర్గం ప్రజలు కేంద్రం వాదనను సమర్థిస్తుండగా, పౌర హక్కుల సంఘాలు మాత్రం దీనిని వ్యక్తిగత స్వేచ్ఛపై దాడిగా అభివర్ణిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఇప్పటికే ఇచ్చిన తీర్పులపై కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో మళ్లీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఉత్కంఠగా మారింది. రాజ్యాంగబద్ధమైన వ్యక్తిగత హక్కులకు మరియు సామాజిక విలువలకు మధ్య జరుగుతున్న ఈ పోరాటం రాబోయే రోజుల్లో మరిన్ని న్యాయపరమైన చర్చలకు వేదిక కానుంది. కేంద్రం అఫిడవిట్‌పై సుప్రీంకోర్టు స్పందన కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# ఆంటీ' అని పిలిచినందుకు భారీ జరిమానా

- యూకే కోర్టు సంచలన తీర్పు
- భారత సంతతి మహిళకు రూ. 1.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం
- వయసు, లింగ వివక్ష కింద వేధింపులుగా పరిగణించిన ట్రిబ్యునల్
- వద్దు అని చెప్పినా పదే పదే పిలవడంపై న్యాయస్థానం ఆగ్రహం



**లండన్, ఏప్రిల్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** యూకేలోని వెస్ట్ లండన్‌లో భారత సంతతి మహిళకు జరిగిన ఒక అవమానంపై అక్కడి కోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. నేషనల్ హెల్త్ సర్వీస్)లో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఐడా ఎస్టీవ్స్ అనే భారత సంతతి మహిళను, సహోద్యోగి 'ఆంటీ' అని పిలిచినందుకు కోర్టు పరిహారం విధించింది. కేవలం ఒక పదం వాడినందుకు 1,425.15 పౌండ్లు (సుమారు రూ. 1.5 లక్షలు) చెల్లించాలని వాట్‌ఫోర్డ్ ఎంప్లాయిమెంట్ ట్రిబ్యునల్ ఆదేశించింది. కార్యాలయాల్లో పని చేసే మహిళల పట్ల గౌరవప్రదంగా నడుచుకోవాలని, పిలవవద్దని చెప్పిన పేర్లతో సంబోధించడం వేధింపుల కిందకే వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

వివరాల్లోకి వెళితే, ఐడా ఎస్టీవ్స్ పనిచేస్తున్న చోటే ఘనా దేశానికి చెందిన చార్లెస్ అప్పాంగ్ అనే మహిళ నర్స్‌గా పనిచేసేవారు. 2023 జూన్ నుండి సెప్టెంబర్ మధ్య కాలంలో చార్లెస్ తన తోటి ఉద్యోగి అయిన ఐడాను నిరంతరం 'ఆంటీ' అని పిలిచేవారు. తను అలా పిలవవద్దని, ఆ పేరుతో సంబోధించడం తనకు ఇబ్బందిగా ఉందని ఐడా పలుమార్లు హెచ్చరించినప్పటికీ చార్లెస్ పట్టించుకోలేదు. ఈ వ్యవహారం ముదిరి మానసిక వేధింపులకు దారితీయడంతో ఐడా కోర్టును ఆశ్రయించారు. తన వయసును, లింగాన్ని కించపరిచేలా ఆ సంబోధన ఉందని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును విచారించిన జడ్జి జార్జ్ అల్లియోట్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తికి ఇష్టం లేని పేరుతో పదే పదే పిలవడం అక్కడి పని వాతావరణాన్ని పాడు చేయడమేనని కోర్టు అభిప్రాయపడింది. చార్లెస్ సొంత దేశమైన ఘనా సంస్కృతిలో 'ఆంటీ' అని పిలవడం గౌరవ సూచకమే అయినప్పటికీ, అవతలి వ్యక్తి దానిని ఇబ్బందిగా భావించినప్పుడు ఆ సంస్కృతిని సాకుగా చూపలేమని కోర్టు తేల్చిచెప్పింది. బాధితురాలు అభ్యంతరం వ్యక్తం చేసిన తర్వాత కూడా అదే పదాన్ని వాడటం వయసు మరియు లింగ వివక్షతో కూడిన వేధింపులని న్యాయమూర్తి నిర్ధారించారు.

దీనివల్ల ఐడా ఎస్టీవ్స్ అనుభవించిన మానసిక వేదనకు పరిహారంగా వెస్ట్ లండన్ ఎన్‌హెచ్ఎస్ ట్రస్ట్ సదరు మొత్తాన్ని చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. కార్యాలయాల్లో ఉద్యోగుల మధ్య ఉండే పరస్పర గౌరవం ఎంత ముఖ్యమో ఈ తీర్పు గుర్తు చేస్తోంది. ఒక సంబోధన ఒక దేశంలో గౌరవంగా అనిపించవచ్చు కానీ, మరో సంస్కృతిలో అది అవమానకరంగా భావించే అవకాశం ఉందని ఈ ఘటన నిరూపించింది. ముఖ్యంగా విదేశాల్లో పనిచేసే భారత సంతతి వ్యక్తుల పట్ల ఇటువంటి వివక్షా పూరిత వ్యాఖ్యలు చేయడం చట్ట రీత్యా నేరమని న్యాయస్థానం హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ తీర్పు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆత్మీయంగా పిలిచే పదాలు కూడా కొన్నిసార్లు వయసును గుర్తు చేస్తూ కించపరిచినట్లు అనిపిస్తాయని సామాజిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బాధితురాలు చూపిన ధైర్యం మరియు కోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పు కార్యాలయాల్లో వేధింపులకు గురయ్యే వారికి అండగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్‌హెచ్ఎస్ ట్రస్ట్ ఈ పరిహారాన్ని వెంటనే చెల్లించడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని కోర్టు సూచించింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in